క్లుప్తంగా

సీఐ బాధ్యతల స్వీకరణ



సీఐ వెంకటేశ్వర్లు

గుత్తి: గుత్తి నూతన సీఐగా సోమవారం వెంకటేశ్వర్లు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సీఐగా పనిచేస్తున్న వెంకటరామిరెడ్డి నంద్యాల జిల్లా ప్యాలిపికి బదిలీ అయ్యారు. ఆలూరులో సీఐగా పని చేస్తున్న వెంకటేశ్వర్లు గుత్తికి బదిలీ అయ్యారు. సీఐగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లును పోలీసు సిబ్బంది, ఆయా శాఖల అధికారులు, ప్రజలు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. నూతన సీఐ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి సమస్య తలెత్తినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఎవరూ చట్టాన్ని చేతిలోకి తీసుకోవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నబీరసూల్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గుంతకల్లు రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన సూచించారు.

విద్యార్థికి అభినందన



విద్యార్థి సంజీవరాయుడును అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

గుంతకల్లుటౌన్: ఢిల్లీలోని ఎర్రకోటలో పంద్రాగస్టు వేడుకల పరేడ్‌లో పాల్గొని ప్రతిభ కనబరిచిన ఎస్‌కేపీ ప్రభుత్వ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థి కె.సంజీవరాయుడును ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, అధ్యాపకులు అభినందించారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ తరఫున తమ కళాశాలకు చెందిన విద్యార్థి జాతీయ స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్‌లో పాల్గొని మెడల్, ప్రశంసాపత్రం సాధించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ నారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని

బుక్కరాయసముద్రం: విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని సూచించారు. సోమవారం మండలంలోని కొర్రపాడు ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు రక్త హీనత నివారణ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. వసతి గృహంలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రోజూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. యోగా, ధ్యానం తప్పనిసరిగా చేయాలన్నారు. నీరు వీలైనంతగా ఎక్కువగా తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ మోహన్‌బాబు, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, హెల్త్ ఎడుకేటర్ పర్వీన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్నాకు మద్దతివ్వండి

గుంతకల్లుటౌన్: పట్టణ ప్రజలు రైల్వేక్వార్టర్స్‌లోకి ప్రవేశించకుండా నిర్మించిన ప్రహరీలు తొలగించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రైల్వే అధికారుల వైఖరిని నిరసిస్తూ ఈ నెల 23న డీఆర్ఎం ఆఫీసు వద్ద చేపట్టిన ధర్నాకు మద్దతివ్వాలని రైల్వే యూనియన్ నాయకులను సీపీఎం నాయకులు కోరారు. సోమవారం మజ్దూర్ యూనియన్ డివిజన్ కార్యదర్శి విజయ్‌కుమార్‌ను సీపీఎం పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు రమేష్, నాగరాజు తదితరులు కలసి మద్దతు కోరారు. రైల్వే యూనియన్ నాయకులు కూడా ధర్నాలో పాల్గొంటారని సీపీఎం నాయకులు తెలిపారు.

రెండు రోజూ ఆటోడ్రైవర్ల శ్రమదానం



రోడ్డుపై గుంతలు పూడుస్తున్న ఆటో డ్రైవర్లు

గుత్తి: ఆటో డ్రైవర్లు రెండో రోజూ శ్రమదానం చేసి రోడ్ల మరమ్మతులు చేపట్టారు. వివరాలు.. పట్టణంలోని గాంధీ సర్కిల్ నుంచి గుంతకల్లు రోడ్డులో ఉన్న రైల్వే బ్రిడ్జి వరకూ పలు చోట్ల గుంతలు పడ్డాయి. మున్సిపల్, పంచాయతీ రాజ్ అధికారులు పట్టించుకోకపోవడంతో ఆటో డ్రైవర్లు స్వచ్ఛందంగా రెండో రోజైన సోమవారం కూడా గుంతలను పూడ్చివేశారు. ఆటో డ్రైవర్లు నజీర్, అమరేశ్వర్, మహ్మద్ రసూల్, సురేష్, లక్ష్మణ్, శ్రీకాంత్, కర్ణ, తదితరులు ఐదు ఆటోల్లో మట్టిని తెచ్చి రోడ్డు మరమ్మతులు చేపట్టారు. ఆటో డ్రైవర్లను పలువురు అభినందించారు.

వామ్మో.. బీసీ హాస్టల్!



హాస్టల్ బిల్డింగ్ సన్‌రూఫ్ కూలిన దృశ్యం. (ఇన్‌సెట్‌లో) గదిలో చదువుకుంటున్న విద్యార్థులు

- రెండు రోజుల కిందట కూలిన పైకప్పు
- భయాందోళనలో విద్యార్థులు

గుంతకల్లు రూరల్: మండలంలోని పాతకొత్త చెరువు బీసీ హాస్టల్ బిల్డింగ్ ప్రమాదపుటంచుల్లో ఉంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బిల్డింగ్‌కు ఒక పక్కన ఉన్న సన్‌రూఫ్ గోడ కూలిపోవడంతో విద్యార్థులు, సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. హాస్టల్ బిల్డింగ్ నిర్మించి దాదాపు 50 సంవత్సరాలు కావస్తుండటం, క్రమంగా శిథిలావస్థకు చేరి ఒకవైపు గోడ కూలిపోవడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది బిక్కుబిక్కుమంటూ కాలాన్ని నెట్టుకొస్తున్నారు. హాస్టల్‌లో 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ దాదాపు 140 విద్యార్థులు ఉంటున్నారు. వారంతా పాతకొత్తచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రైమరీ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. వసతుల లేమి, సౌకర్యాల లేమితో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న తరుణంలో 2019లో అప్పటి కలెక్టర్ సత్యనారాయణ హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. స్నానపు గదులు సరిగా లేవని, మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేక అవస్థలు పడుతున్నామని, భోజనం కూడా నాణ్యతగా ఉండటంలేదని విద్యార్థులు కలెక్టర్‌కు వివరించారు. దీంతో అప్పటికప్పుడు ప్రత్యేకంగా నిధులు విడుదల చేయించిన కలెక్టర్ మరుగుదొడ్లు, స్నానపు గదులతోపాటు పాఠశాలలో చిన్నచిన్న మరమ్మతులు కూడా చేయించారు. ప్రతి ఒక్కరికీ చెప్పులు తీయించిన ఆయన బెడ్‌షీట్లను కూడా పంపిణీ చేశారు. అప్పటి నుంచి హాస్టల్ నిర్వహణ బాగానే నడుస్తూ వచ్చింది. ఈ క్రమంలో గత శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి హాస్టల్ బిల్డింగ్ ఒక వైపున ఉన్న సన్‌రఫ్, సీలింగ్ ఒక్కసారిగా కూలిపోయింది. బిల్డింగ్ పాతది కావడంతో ఏ సమయంలో ఏమి జరుగుతుందో తెలియక అప్పటి నుంచి విద్యార్థులు హాస్టల్‌లో ఉండటానికి భయపడుతున్నారు. పగలంతా స్కూల్‌కు వెళ్లివచ్చే విద్యార్థులు రాత్రిపూట హాస్టల్‌లో పడుకోవాలంటేనే భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి హాస్టల్‌కు మరమ్మతులు చేయాలని విద్యార్థులు, సిబ్బంది కోరారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

రెండురోజులుగా భారీ వర్షాలు పడటంతో ఆదివారం అర్ధరాత్రి సమయంలో గోడ కూలింది. బిల్డింగ్‌లో మిగిలిన అన్ని చోట్ల పరిస్థితి బాగానే ఉన్నా విద్యార్థులు భయపడుతున్నమాట వాస్తవమే. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అధికారుల నుంచి ఆదేశాలు రాగానే వెంటనే మరమ్మత్తులు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

– ఖాదర్ హుస్సేన్, వార్డెన్

హాస్టల్‌లో ఉండాలంటే భయమేస్తోంది



గోడ కూలినప్పటి నుంచి హాస్టల్‌లో ఉండాలంటే భయమేస్తుంది. రాత్రి పూట విద్యార్థులు చాలా మంది నిద్రపోవడం లేదు. స్టడీ అవర్స్‌లో చదువు పైన ధ్యాస పెట్టలేకపోతున్నాం. రాత్రి పూట వర్షాలు ఎక్కువగా పడుతుండటంతో తెల్లారేసరికి ఏ సమయంలో ఏం జరుగుతుందోనని ఆందోళనగా ఉంది.

– చరణ్ నాయక్, 10వ తరగతి

మరమ్మతులు చేయాలి



స్కూల్ ముగిసిన తరువాత నుంచి మరుసటి రోజు వరకూ హాస్టల్‌లో భయంతోనే గడుపుతున్నాం. బిల్డింగ్ పూర్తిగా పాతది కావడంతో ఎప్పుడు కూలుతుందోనని ఆందోళనగా ఉంది. రెండు రోజుల క్రితం గోడ కూలినప్పటి నుంచి హాస్టల్‌లో ఉన్నంతసేపు బిక్కుబిక్కుమంటూ కాలాన్ని గడుపుతున్నాం. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలి

– మణికుమార్, 10వ తరగతి

నిందితులను కఠినంగా శిక్షించాలి



తాడిపత్రిలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నేతలు



గుత్తి మండలం బేతాపల్లిలో ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

తాడిపత్రి అర్బన్/గుత్తి రూరల్/శింగనమల: కలకత్తాలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నిందితులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ప్రజా సంఘాలు సోమవారం సాయంత్రం తాడిపత్రి పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించాయి. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి శ్రీరామ్‌మూర్తి, సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురామయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు రమణ, ఏఐటీయూసీ నాయకులు ఉమాగౌడ్, సీపీఐ నాయకులు రవికుమార్, కృష్ణనాయక్, రామాంజినేయులు, అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వైద్య విద్యార్థిని హత్యను నిరసిస్తూ గుత్తి మండలం బేతాపల్లిలో పీహెచ్‌సీ వైద్యులు ప్రవీణ్‌కుమార్, దేవేంద్రనాయక్, సిబ్బంది జబ్రుల్లా, ఆంజనేయులు, రామకృష్ణ, లాజరస్ ర్యాలీ నిర్వహించారు. అలాగే వైద్యులకు రక్షణ కల్పించాలంటూ శింగనమలలో తహసీల్దార్ బ్రహ్మయ్యకు సీపీఐ జిల్లా సమితి నాయకుడు తరిమెల రామాంజనేయులు, నాయకులు లక్ష్మీరంగయ్య, నాగప్ప, ఓంకార్, రవి, చంద్ర నారాయణ తదితరులు వినతి పత్రం అందజేశారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: విద్యార్థులు సైబర్ సెక్యూరిటీపై అవగాహన పెంపొందించుకోవాలని జేఎన్‌టీయూ కంప్యూటర్ విభాగం ప్రొఫెసర్ శోభాబిందు సూచించారు. సోమవారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ టెక్నాలజీని మంచి కోసమే వినియోగించుకోవాలన్నారు. విద్యార్థులు సైబర్ సమస్యలు ఎలా ఎదుర్కోవాలో వివరించారు. డిజిటల్ లావాదేవీలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ బాలక్రిష్ణ, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ వెంకట నాగజయుడు, కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ హేమంత్‌కుమార్ యాదవ్, కొర్రపాడు ఎస్సీ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి, సరళ, విద్యార్థులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వర్షం



పెద్దవడుగూరు సమీపంలో నీట మునిగిన పత్తి



వర్షపు నీటితో పోటెత్తిన పందుల వాగు

పెద్దవడుగూరు/పామిడి/గార్లదిన్నె: పెద్దవడుగూరు మండలంలో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో వంకలు, వాగులు పొంగిపొర్లాయి. పెద్దవడుగూరు సమీపంలోని పందుల వాగు వర్షం నీటితో పోటెత్తింది. సుమారు నాలుగు గంటల పాటు నీటి ప్రవాహం కొనసాగడంతో అనంతపురం వెళ్లే ఆర్టీసీ బస్సులతో పాటు వాహనాల రాకపోకలు స్తంభించాయి. పెద్దవడుగూరు. విరుపాపురం, ఆవులాంపల్లి తదితర గ్రామాలల్లోని పంట పొలాలు నీట మునిగాయి. అలాగే పామిడి, గార్లదిన్నె మండలాల్లో వాన దంచికొట్టింది.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



డీఆర్ఎంకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

గుంతకల్లు/టౌన్/పామిడి: గుంతకల్లులోని డీఆర్ఎం కార్యాలయంలో సోమవారం రక్షాబంధన్ వేడుకలను ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ సంచాలకులు రాజయోగిని బీకే శంకుతల, బీకే పార్వతి, బీకే గిరిజ అక్కయ్య తదితరులు నేతృత్వంలో డీఆర్ఎం విజయ్‌కుమార్‌తోపాటు ఏడీఆర్ఎం సుధాకర్ ఇతర అధికారులకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్.భవాని ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ కౌన్సిలర్లకు, మున్సిపల్ వాటర్‌వర్క్స్, కార్యాలయ సిబ్బందికి చైర్‌పర్సన్‌తోపాటు ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అర్చనా కార్వా, సునీతలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా పామిడి పట్టణంలో భావసార క్షత్రియులు రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన



డీటీకి వినతి పత్రం అందజేస్తున్న మాలమహానాడు నాయకులు

గుత్తి రూరల్: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా, క్రిమిలేయర్‌ను సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా మాల మహానాడు నాయకులు నిరసన తెలిపారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేస్తూ సుప్రీం కోర్టు ఏకపక్షంగా తీర్పు ఇవ్వడం దారుణమన్నారు. తీర్పును వ్యతిరేకిస్తూ ఈ నెల 21న భారత్‌బంద్‌కు పిలుపు ఇచ్చామన్నారు. 21న ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు, దుకాణాలు, హోటళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు స్వచ్ఛందంగా మూసివేసి బంద్‌కు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ లలితకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు కేవీ చలపతి, నాగప్ప, నాగరాజు, శ్రీరాములు, న్యాయవాదులు సాలప్ప, రామాంజనేయులు, హరిదాసు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పామిడి: మండలంలోని కండ్లపల్లి పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. సీఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఇసుక తరలిస్తున్న ప్రకాష్‌ను అరెస్టు చేశారు. ట్రాక్టర్‌ను సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి, నిందితుడిపై కేసు నమోదు చేశారు.

ఉద్యాన పంటల సాగుకు దరఖాస్తు చేసుకోండి

గుత్తి రూరల్: ఉద్యాన పంటలు సాగు చేసిన, సాగు చేయదలచుకున్న రైతులు తమ పేర్లను రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని మండల ఉద్యానవన అధికారిణి మిత్రవింద మాధవి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ 2024–25లో సబ్సిడీ కింద మామిడి, జామ, అల్లనేరేడు, దానిమ్మ, అరటి, బొప్పాయి మొక్కలు నాటుకునే రైతులకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు అలాగే ఫారంపాండ్లు, ప్యాక్‌హౌస్‌లకు కూడా ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. రైతులు సాగు చేసిన ప్రతి పంటను ఈ–పంటలో నమోదు చేసుకోవాలని హెచ్ఓ సూచించారు.

వైభవంగా శ్రావణ పూజలు



అలంకరణలో బుగ్గ రామలింగేశ్వరుడు

తాడిపత్రి అర్బన్: స్థానిక బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా సోమవారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెన్నానదిలో చన్నీటి స్నానమాచరించి స్వామిని దర్శించుకున్నారు. **యాడికి:** మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో చెన్నకేశవ స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు హరిస్వామి, ఈఓ దుర్గా ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

పరామర్శ



బాలరాజును పరామర్శిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

పుట్లూరు: మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకుడు బాలరాజుపై టీడీపీ నాయకుడు దాడి చేశారు. ఈ దాడిలో గాయాలైన బాలరాజు అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటుండగా సోమవారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఆలూరు సాంబశివారెడ్డి తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులకు స్కాలర్ షిప్ పంపిణీ

గుంతకల్లు: స్థానిక శ్రీ శంకరనంద గిరి స్వామి డిగ్రీ కళాశాలలోని ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు మెరిట్ స్కాలర్ షిప్‌లను పంపిణీ చేసినట్లు ప్రిన్సిపాల్ గోపాల్ తెలిపారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రాజ్ ఫౌండేషన్ సహకారంతో బీకాం కంప్యూటర్స్ విద్యార్థి ఆయేషాజహాన్, బీబీఏలో గీతిక, బయోటెక్నాలజీ ఆఫీన్‌కు ఒక్కొక్కరికి రూ.5000 చొప్పున అందజేశారు. అలాగే ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.3,000 వేలు చొప్పున అందజేసినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బసెట్టి కృష్ణయ్య, శివయ్య, డాక్టర్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్ ఏర్పాటు చేయాలి

గుంతకల్లు: నియోజకవర్గంలో ఇసుక రీజ్ ఏర్పాటు చేయాలని సీపీఎం ఎంఎల్ న్యూ డెమోక్రసీ గుంతకల్లు డివిజన్ కమిటీ కార్యదర్శి బి.సురేష్ కోరారు. ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి అందుబాటులో లేకపోవడంతో ఏవో ఉదయ్‌భాస్కర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గుంతకల్లులో ఇసుక రీచ్ లేకపోవడంతో రాయదుర్గం మండలం జుంజురాంపల్లి రీచ్ నుంచి ఇసుక రవాణా ద్వారా అధిక మొత్తం చెల్లించాల్సి వస్తోందన్నారు. నియోజకవర్గంలో ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేయడంతోపాటు ట్రాకర్లు, ఎద్దులబండి ద్వారా వాగుల్లో, వంకల్లో అందుబాటులో ఉన్న ఇసుకను తెచ్చుకోవడానికి అధికారులు అనుమతించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రఘునాథ్‌రెడ్డి, జిలాన్, ఐఎన్‌టీయూ నాయకులు భాష, గోపీ, రాందాస్, విశ్వనాథ్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై 23న గ్రామసభలు

యల్లనూరు ఉపాధిహామీ పథకంపై ఈనెల 23న అన్ని పంచాయతీల్లో గ్రామసభలు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ వీరరాజు సూచించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి పంచాయతీలో తప్పకుండా గ్రామసభలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ విజయశేఖర్‌నాయుడు, ఏపీఓ షబ్బీర్‌బాషా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల కోసం ధర్నా



మాట్లాడుతున్న రంగయ్య

తాడిపత్రి రూరల్: స్థానిక తాహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి రంగయ్య ఆధ్వర్యంలో ఇళ్ల పట్టాల కోసం ధర్నా చేశారు. కార్యాలయం ఆవరణలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బండల పాలీసు, గ్రానైట్ కార్మికులు, బీడీ కార్మికులు, హమాలీలు, మున్సిపల్ కార్మికులకు ఇళ్ల పట్టాలు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఇళ్ల పట్టాల పంపిణీపై అధికారులను ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. చల్లవారిపల్లి వంక, సజ్జలదిన్నె వద్ద గల బంజరు భూములను పేదలకు కేటాయించాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించి పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. అనంతరం ఇన్‌చార్జ్ తాహసీల్దార్ ఆంజనేయ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఓబులేసు, బాలనాయుడు, చిన్న కృష్ణుడు, గోపాలక్రిష్ణ, సురేష్, సుబ్బరాయుడు, పుల్లయ్యనాయుడు, లింగమయ్య, నరసింహులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

పుట్లూరు: వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శేషారెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ రైతులకు పరిహారం అందించడంతో పాటు గత ఏడాది పంటల బీమాను ప్రకటించి, నష్ట పరిహారాన్ని ఖాతాలలో జమ చేయాలన్నారు. అలాగే ఇన్‌పుట్ సబ్సిడీ అందించి ఖరీఫ్‌లో పంటల సాగుకు చేయూత అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సూరి, రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

గుత్తి రూరల్: వాల్మీకి, బోయ సామాజిక వర్గాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ లలితకు వాల్మీకి సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ వాల్మీకి, బోయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లెల్లి కృష్ణయ్య మాట్లాడుతూ వెనుకబడిన వర్గానికి చెందిన వాల్మీకి, బోయలు అన్ని రంగాల్లో వెనుకపడి ఉన్నారన్నారు. విద్య, ఉద్యోగ, సామాజిక పరంగా అభివృద్ధి చెందాలంటే వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఇప్పటికే ఎస్టీ జాబితాలో ఉన్నామని ఏపీలో కూడా చేర్చాలన్నారు. కార్యక్రమంలో ఏపీ వాల్మీకి, బోయ సంఘం గౌరవ అధ్యక్షుడు జయరాం, నాయకులు లాల్‌శేఖర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

అర్జీలపై తక్షణం స్పందించండి

యల్లనూరు: ప్రతి సోమవారం నిర్వహించే ఫిర్యాదుల విభాగానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, లేని పక్షంలో ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతానని తహసీల్దారు నాగరాజు అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగానికి నాలుగు వినతులు వచ్చాయన్నారు. వాటిలో భూమి సమస్యలపై మూడు, ఆన్‌లైన్ సమస్యపై ఒక్క అర్జీ వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీరరాజు, ఏపీవో షబ్బీర్‌బాషా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రజ, హౌసింగ్ ఏఈ సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలి

గుంతకల్లు రూరల్: సమాచార హక్కు చట్టాన్ని పటిష్టంగా, సక్రమంగా అమలుచేయాలని కోరుతూ సమచారహక్కు ఉద్యమకారులు సోమవారం తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. సమాచార హక్కు చట్టంపై వెనకబడిన వర్గాలకు అవగాహన కల్పిచే బాధ్యతను ప్రభుత్వం, అధికారులు తీసుకోవాలని, అదే విధంగా అపిలేట్ అధికారుల పేర్లు బోర్డుల్లో ఏర్పాటు చేయాలని కోరారు. సమాచార హక్కు పటిష్టతకు కృషి చేసే స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేస్తూ చట్టాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని కోరారు. సభ్యులు బాలరాజ్, లాల్‌రెడ్డి, రాయల్ అనిల్, సూరిరెడ్డి, రామచంద్ర , ఈరప్ప, తిక్కస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

గార్లదిన్నె: ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని ఎంఈఓ–2వెంకటరమణ నాయక్ సూచించారు. సోమవారం మండలంలోని మర్తాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరు శాతం పెంచాలన్నారు. విద్యార్థులకు రోజూ నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

పెద్దవడుగూరు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ–2 గురుప్రసాద్ సూచించారు. సోమవారం స్థానిక జెడ్పీ పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా బోధన ఉండాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.